RNI: TELTEL12215

https://youtube.com/@UstudioTV
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@UstudioTV
94940 54338

RANGAREDDY, EDITION : 01, VOLUME :169 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 03 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 169 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 03 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


# కాపలాదారుడిగా ఉంటా

## తెలంగాణ ప్రజలు ఆలోచించి ఓటేయండి : ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

**నిర్మల్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ ప్రజలకు కాపలదారుగా ఉంటా .. అందుకే ఆలోచించి ఓటేయండి అని సీఎం కేసీఆర్ ఓటర్లను పార్ధించారు.ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీ గెలవాలి.. అప్పుడే ప్రజల కోరికలు తీరుతాయి.. అందుకే ఆలోచించి ఓటేయాలి అని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిర్మల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.తెలంగాణ వచ్చిన తర్వాత మూడోసారి రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఎలక్షన్లు వస్తాయి పోతాయి.. ఎన్నికలు అన్నప్పుడు అన్ని పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తారు. అందర్నీ ఒకటే ప్రార్థిస్తున్నాను. 75 ఏండ్ల స్వతంత్ర దేశంలో ఇప్పటికి ప్రజాస్వామ్య పరిణితి రాలేదు. ఏ దేశాల్లో అయితే అది వచ్చిందో ఆ దేశాలు ముందుకు దూసుకుపోతున్నాయి. ఎన్నో రెట్లు ముందు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు.నేను చెప్పే మాటలను గ్రామాల్లో, బస్తీల్లో చర్చ పెట్టాలని కేసీఆర్ సూచించారు. కారణం ఏందంటే.. ఎలక్షన్లు వచ్చాయి. రెండో మూడో నాలుగో పార్టీలు పోటీ చేస్తాయి. ఇంద్రకరణ్ రెడ్డి లాగా ఇతర పార్టీల నుంచి కూడా ఎవరో ఒకరు పోటీలో ఉంటారు. 30న ఓట్లు వేస్తారు. 3న లెక్క తీస్తారు. ఎవరో ఒకరు గెలుస్తరు. ప్రజాస్వామ్య దేశంలో పార్లమెంటరీ డెమోక్రసీలో ప్రజలకు ఒక వజ్రాయుధం ఓటు. మీ ఓటు మీ తలరాతను లిఖిస్తది వచ్చే ఐదేండ్లు. పార్టీల అభ్యర్థులు మంచి చెడు తెలుసుకోవాలి. అభ్యర్థులు గెవడంతో ప్రభుత్వం ఏర్పడతుంది. ఏ ప్రభుత్వం ఏర్పడితే లాభమేనేది చర్చ జరగాలి. ప్రతి పార్టీ చరిత్ర చూడాలి. ఆయా పార్టీల హాయాంలో ఏం జరిగిందో ఆలోచించాలి. ఎన్నికలు రాగానే ఆగమాగం

మిగతా 2లో





## టీమిండియా రికార్డుల హోరు

### - శ్రీలంకపై 302పరుగుల తేడాతో గెలుపుతో సెమీస్‌కు
### - బ్యాటింగ్‌లో గిల్, కోహ్లి, శ్రేయస్... బౌలింగ్‌లో షమీ, సిరాజ్...

**ముంబయి - ప్రభాత సూర్యుడు**

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా పలు రికార్డులను నెలకొల్పింది. ముంబయిలోని వాంఖడే స్టేడియంలో శ్రీలంకపై 302 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా వరుసగా ఏడు మ్యాచుల్లో గెలుపొందడం ఇదే తొలిసారి. అలాగే మహ్మద్ షమీ(5/18) బౌలింగ్‌లో మెరిసి..

మిగతా 2లో



## 7, 11న తెలంగాణలో ప్రధాని మోడి ప్రచారం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ... ఈ నెల 7, 11వ తేదీల్లో ప్రధాని మోడి తెలంగాణలో ప్రచారం చేయనున్నారు. 19వ తేదీ తరువాత మరోసారి ఎన్నికల ప్రచారానికి ప్రధాని రానున్నట్లు సమాచారం. మోడీ తెలంగాణలో పర్యటించారు. ఆ తర్వాత అభ్యర్థుల జాబితాలో బిజీబిజీగా ఉన్న తెలంగాణ బీజేపీ నేతలు.. ఇప్పుడు మళ్లీ ప్రచారంపై ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి

మిగతా 2లో



## ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### - తెలంగాణలో చంద్రబాబుపై కేసు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద బేగంపేట పోలీసులు చంద్రబాబు ర్యాలీపై కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ర్యాలీ చేశారని ఎస్ఐ జయచందర్ ఫిర్యాదుతో క్రైం నంబర్ 5312023 కేసు నమోదైంది. ఐపిసి సెక్షన్ 341, 290, 21 రెడ్ విత్ 76 సిపి యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.


**సోషల్ మీడియా ప్రచారంతో విమానాశ్రయానికి కార్యకర్తలు...**

మంగళవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన చంద్రబాబు బుధవారం

మిగతా 2లో

## ఓట్ల పండుగ... అంతా సిద్ధం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన మైన నామినేషన్‌ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు నామినేషన్ లు వేసేందుకు మూడో తేదీ నుండి 10 తారీకు వరకు అవకాశం ఉంది. అన్ని నియోజకవర్గాల్లో యంత్రాంగం నామినేషన్ ప్రక్రియ కు జిల్లా వ్యాప్తంగా నామినేషన్ సెంటర్ లను సిద్ధం చేసింది. రెవెన్యూ ,పోలీస్ శాఖ వారి సమన్వయం తో పటిష్ఠమైన భద్రత తో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాలు విధి విధానాల పై రాజకీయ నాయకులకు ,పార్టీ ప్రతినిధులు ముందస్తుగానే అవగాహన కార్యక్రమాలు కల్పించారు . అభ్యర్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కేంద్రాల్లో సహాయక సెంటర్లను ఏర్పాటు చేశారు అధికారులు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం ఉదయం భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనున్నది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను సిద్ధంచేసింది. ఆయా కార్యాలయాల్లో 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 5వ ఆదివారం సెలవు కావడంతో నామినేషన్లు తీసుకోరు. ఒకే రోజు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వస్తే వారికి స్లిప్‌లు ఇచ్చి అందరూ నామినేషన్లు వేసే అవకాశం కల్పించనున్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మంచి రోజులు ఉన్నాయని సమాచారం. ఈ మూడు రోజుల్లోనే ఎక్కువ సంఖ్యలో నామినేషన్లన్లు దాఖలవుతాయని అంచనా వేస్తున్నారు.

మిగతా 2లో

## బీజేపీ మూడో జాబితా విడుదల



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ ఎన్నికలకు సంబంధించి బీజేపీ గురువారం మూడో జాబితాను విడుదల చేసింది అంబర్‌పేట నియోజకవర్గం నుంచి కృష్ణ యాదవ్ బరిలో ఉన్నారు. మొత్తం 35 మందితో మూడో లిస్ట్‌ను బీజేపీ హై కమాండ్ విడుదల చేసింది. ఈ జాబితాలో ఎస్సీ 5, ఎస్టీ 3 మందికి చోటు కల్పించారు. ఇక ఇప్పటికే రెండు జాబితాలల్లో మొత్తం 53 మందిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక మూడో జాబితాలో అందోల్ నుంచి బాబుమోహన్, బాన్సువాడ నుంచి యెండల లక్ష్మీ నారాయణ, ఉప్పల్

మిగతా 2లో

## పారిశ్రామిక వేత్తలుగా గిరిజనులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



గిరిజనులు పారిశ్రామికంగా ఎదగాల్సి ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎస్టీ ఆంత్రప్రెన్యూర్స్ కోసం ప్రత్యేకంగా ఉత్పత్తుల పార్కు పెడతామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ పార్క్ హయత్‌లో గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సక్సెస్ మీట్‌లో మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. గిరిజనులు చాలా ఎత్తుకు ఎదగాలని కలలు కనాలని, అలాంటివారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఎల్లారెడ్డి మండలంలో ముగ్గురు దళితబంధు లబ్దిదారులు రైస్ మిల్ పెట్టుకున్నారని తెలిపారు. అదేవిధంగా వాటర్‌వర్క్స్‌లో దళితబంధు కింద 150 వాహనాలు ఇచ్చామని వెల్లడిచారు. ప్రభుత్వ సంస్థలతో కలసి పనిచేసేవాళ్లకు పోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. వచ్చే నెల 3న మరోసారి విజయం సాధించి సక్సెస్ మీట్ జరుపుకుందాని చెప్పారు.ఒకే లక్ష్యంతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని, దీనికి సీఎం కేసీఆర్ జీవితమే ఉదాహరణ అని మంత్రి కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మారుమూల ప్రాంతంలో పుట్టారని, ముంబైలోని షాపూర్జీ పల్లోంజీ కంపెనీలో కాంట్రాక్టులు చేశారని అన్నారు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చారన్నారు. రాజకీయాల్లో ప్రవేశించిన మొదట్లో సింగిల్ విండో ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారన్నారు. అయినా పట్టుదలతో రాజకీయాల్లో కొనసాగారని తెలిపారు. ఆర్వాత ఎన్నికల్లో గెలిచి మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదని వెల్లడించారు. తెలంగాణ చరిత్రనే మార్చేసిన నాయకుడిగా ఎదిగారన్నారు. గిరిజన పారిశ్రామిక వేత్తలను చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఏ కులంలో పుట్టామనేది ముఖ్యం కాదని, అవకాశాలను అందిపుచ్చుకోవడం ప్రధానమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటున్నదని చెప్పారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు కావాలన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చే వరకూ తనకు గురించి పెద్దగా తెలియదన్నారు. వ్యాపారంలో పోటీ ఉండాలని అలాంటప్పుడే విజయాలు సాధించగలుగుతామన్నారు. వ్యాపారంలో విజయం సాధించినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఈరోజు స్టార్టప్ లుగా మొదలైనవారు రేపు రాబోయేవారికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యాపారులకు మంచి ప్రోత్సాహకాలు అందిస్తోంది అంటూ ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు.గిరిజనులు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సీఎం కేసీఆర్ విజన్ వల్లే ఎస్టీ పారిశ్రామిక వేత్తలు తయారవుతున్నారని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంత్రి కేసీఆర్ అన్నివిధాలు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో అనే పార్టీలు, ప్రభుత్వాలను చూశామని గిరజనులను మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. అయితే స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో గిరుజనులు అభివృద్ధి చెందారని తెలిపారు.

## 7, 11న తెలంగాణలో
# ప్రధాని మోడి ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ పర్యటకు రానున్నారు. ఈనెల 7, 11 తేదీల్లో తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారైంది. ఈనెల 7న తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ ఆత్మగౌరవ సభకు ప్రధాని మోడీ హాజరుకానున్నారు. అలాగే... 1వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభకు కూడా ముఖ్యఅతిథిగా రాబోతున్నారు ప్రధాని. మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు ప్రధాని రాష్ట్రానికి రానుండటం ఆసక్తి కలిగిస్తోంది. ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనతో మరోసారి రాజకీయం హీటెక్కబోతుంది. గత నెలలో నిజామాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ సీఎం కేసీఆర్‌పై సంచనల ఆరోపణలు చేశారు. రహస్యం చెప్పేస్తున్నా అంటూ... సీఎం కేసీఆర్ గుట్టు బయటపెట్టారు. తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని.. సీఎం కేసీఆర్ తనను అడిగారని.. అయితే.. తాను ఒప్పుకోలేదని చెప్పారు. వారసులను ముఖ్యమంత్రులను చేయడానికి కేసీఆర్ ఏమైనా రాజా, చక్రవర్తా అంటూ కామెంట్ చేశారు. అంతేకాదు ఎన్డీయేలో చేరేందుకు కూడా కేసీఆర్ ఓకే అన్నారని.. కానీ తానే ఒప్పుకోలేదన్నారు. ఆనాడు ప్రధాని మోడీ చేసిన ఆ ఆరోపణలతో బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనుకుంటే.. మోడీ పర్మిషన్ అవసరంలేదంటూ కౌంటర్ ఇచ్చారు. అప్పుడు.. తెలంగాణ రాజకీయాల్లో అగ్గి రాజేసి వెళ్లిన ప్రధాని మోడీ... ఈసారి కూడా అదే పంథా కొనసాగిస్తారా..? బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడతారా..? లేక... తెలంగాణ ప్రజలకు హామీలు ఇచ్చి వెళ్లిపోతారా? అన్న అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైపోయింది. ఈసారి ప్రధాని మోడీ... ఏ సీక్రెట్ బయటపెడతారో అంటూ మాట్లాడుకుంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మరోవైపు.. కేసీఆర్ కూడా ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజులు రెండు, మూడు సభల చొప్పున నిర్వహిస్తున్నారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనుకున్నారన్న ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ స్పందించలేదు. ప్రస్తుతం ప్రధాని మోడీ కూడా మరోసారి తెలంగాణ పర్యటనకు రానుండటంతో.. మరోసారి ఆ విమర్శలు తెరపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. దీనికి కేసీఆర్ ఎలా స్పందిస్తారు..? తెలంగాణ పర్యటనలో మోడీ రియాక్షన్ ఏంటి..? అన్నది పొలికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘన

(మొదటిపేజీ తరువాయి)


ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. చంద్రబాబుకు మద్దతు కోరుతూ అందరూ రావాలంటూ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో దాదాపు 2 వేల మంది టిడిపి కార్యకర్తలు అక్కడకు వచ్చారు. సాయంత్రం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు కాన్వారును అనుసరిస్తూ పార్టీ జెండాలు, ప్లకార్డులతో ముందుకు కదిలారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి చేరుకోవడానికి దాదాపు మూడున్నర గంటలు పట్టింది.

**ర్యాలీకి అనుమతి పొందలేదు..**

హైదరాబాద్‌లో సాధారణ సమయాల్లోనే ర్యాలీలు, నిరసనలు, ప్రదర్శనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. పైగా, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీని ప్రకారం టిడిపి తెలంగాణలో పోటీ చేయకపోయినా రిటర్నింగ్ అధికారి నుంచి ర్యాలీకి అనుమతి పొందాలి. 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడటంతోపాటు ర్యాలీలో వాహనాలను అడ్డదిడ్డంగా నడిపి, అంబులెన్స్‌లకు సైతం దారి ఇవ్వకపోవడంతో హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు గంటల పాటు రోడ్లపై న్యూసెన్స్ చేసి ప్రజలను ఇబ్బందులను గురిచేశారని చంద్రబాబుపై ఎస్ఐ జయచందర్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సిటీ టిడిపి పార్టీ జనరలసెక్రెటరీ జీవీజీ నాయుడు సహా పలువురిపై కేసులు నమోదు చేశారు. సుమారు 400మంది ర్యాలీలో పాల్గన్నారని పోలీసులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# బీజేపీ మూడో
# జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)



నుంచి ఎన్‌వీఎస్ ప్రభాకర్‌కు చోటు దక్కింది. థర్డ్ లిస్టులో కూడా బండారు దత్తాత్రేయ కుమార్తెకు మొండి చెయ్యి ఎదురైంది. అలాగే కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, నాంపల్లి, కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి స్థానాలను బీజేపీ నాయకత్వం పెండింగ్‌లో పెట్టింది. జనసేనకు కూడా కొన్ని సీట్లు కేటాయించే అవకాశం ఉంది. దీనిపై ఇంకా క్లారిటీ రాలేదు.

**అభ్యర్థులు వీరే..**

**ఆసిఫాబాద్-అజ్మీరా ఆత్మారామ్ నాయక్**
**బాన్సువాడ-యెండల లక్ష్మీనారాయణ**
**మంథని-చందుపట్ల అనిల్‌రెడ్డి**
**బోధన్-వడ్డి మోహన్‌రెడ్డి**
**అంబర్‌పేట - కృష్ణాయాదవ్**
**సికింద్రాబాద్ - మేకల సారంగపాణి**
**జూబ్లీహిల్స్ - లంకల దీపక్‌రెడ్డి**
**ముషీరాబాద్ - పూస రాజు**
**పరిగి- మారుతీ కిరణ్**
**రాజేంద్రనగర్- తోకల శ్రీనివాసరెడ్డి**
**ఉప్పల్ - ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**
**ఎల్బీనగర్ - సామారంగారెడ్డి**
**సనత్‌నగర్ - మర్రి శశిధర్ రెడ్డి .**

# టీమిండియా రికార్డుల హోరు

(మొదటిపేజీ తరువాయి)

వన్డే ప్రపంచకప్‌లో 45వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో జహీర్‌ఖాన్, జవగళ్ శ్రీనాథ్(44వికెట్లు) రికార్డును చెరిపేసాడు. అలాగే విరాట్ కోహ్లి వ్యక్తిగత స్కోర్ 34 పరుగుల వద్ద ఈ ఏడాది వెయ్యి పరుగుల మార్క్‌ను అందుకొని టీమిండియా తరపున అత్యధికసార్లు ఒక ఏడాదిలో వెయ్యి పరుగులు పూర్తి చేసుకున్న సచిన్(11) సరసన నిలిచాడు. ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా రికార్డులు నెలకొల్పుతోంది. వాంఖడే స్టేడియంలో శ్రీలంకతో గురువారం జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 302 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది.

తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 357పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక జట్టు 19.3ఓవర్లలో 55పరుగులకే కుప్పకూలింది. షమీ(5/18), సిరాజ్(3/16) బౌలింగ్‌లో మెరిసారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(4) ఔటయ్యాడు. మధుశంక వేసిన రెండో బంతికి రోహిత్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (92), విరాట్ కోహ్లీ(88) అర్ధసెంచరీలతో మెరిసారు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 189పరుగులు జతచేశారు. వీరు రన్ రేట్ 6కు తగ్గకుండా ఆడారు. అయితే సెంచరీలకు చేరువవుతున్న క్రమంలో మధుశంక భారత్‌కు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. 30వ ఓవర్లో గిల్‌ను ఔట్ చేసిన మధుశంక.. మరుసటి ఓవర్లో కోహ్లీని కూడా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్(21), శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి నాల్గో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. 40వ ఓవర్లో ఛమీరా బౌలింగ్‌లో హేమంతకు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. ఆ సమయానికి భారతజట్టు స్కోర్ 5వికెట్ల నష్టానికి 276పరుగులు. టి20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్(12) పేలవ ఫామ్ మరోసారి కొనసాగింది. చివర్లో శ్రేయాస్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కసున్ రజిత వేసిన 36వ ఓవర్లో భారీ సిక్సర్ బాదిన అయ్యర్.. తీక్షణ వేసిన 41వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా అద్భుతమైన సిక్స్ కొట్టాడు. 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన అయ్యర్.. మధుశంక వేసిన 48వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు మూడోబంతినీ సిక్సర్ కొట్టేందుకు ప్రయత్నించి తీక్షణ చేతికి చిక్కాడు. చివర్లో రవీంద్ర జడేజా (35) ధాటిగా ఆడటంతో భారత్ 350 పరుగుల మైలురాయిని దాటింది. శ్రీలంక బౌలర్లలో దిల్షాన్ మధుశంకకు ఐదు, ఛమీరాకు ఒక వికెట్ దక్కాయి.

భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక జట్టు పరుగుల ఖాతా తెరవకుండానే నిస్సంక(0) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కరుణరత్నే, సమరవిక్రమ కూడా పరుగుల ఖాతా తెరవకుండానే పెవీలియన్‌కు చేరడంతో లంక జట్టు 2పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత టీమిండియా పేసర్లు షమీ, సిరాజ్ వరుసగా వికెట్లు తీయడంతో లంక జట్టు 29పరుగులకే 8వికెట్లు కోల్పోయి ఓటమికోరల్లో నిలిచింది. చివరి రెండు వికెట్లకు లంక 26పరుగుల జతచేయడంతో ఊపిరి పీల్చుకుంది. బుమ్రా(1/8), జడేజా(1/4)కి తోడు షమీకి ఐదు, సిరాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మహ్మద్ సిరాజ్‌కు లభించింది.

**స్కోర్‌బోర్డు..**

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి)మధుశంక 4, శుభ్‌మన్ (సి)కుశాల్ మెండీస్ (బి)మధుశంక 92, కోహ్లి (సి)నిస్సంక (బి)మధుశంక 88, శ్రేయస్ (సి)తీక్షణ (బి)మధుశంక 82, కెఎల్ రాహుల్ (సి)హేమంత (బి)ఛమీర 21, సూర్యకుమార్ యాదవ్ (సి)కుశాల్ మెండీస్ (బి)మధుశంక 12, జడేజా (రనౌట్) సమరవిక్రమ/కుశాల్ మెండీస్ 35, షమీ (రనౌట్)కుశాల్ మెండీస్ 2, బుమ్రా (నాటౌట్) 1, అదనం 20. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 357పరుగులు.

వికెట్ల పతనం: 1/4, 2/193, 3/196, 4/256, 5/275, 6/233, 7/355, 8/357

బౌలింగ్: మధుశంక 10-0-80-5, ఛమీర 10-2-71-1, రజిత 9-0-66-0, మాథ్యూస్ 3-0-11-0, తీక్షణ 10-0-67-0, హేమంత 8-0-52-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (ఎల్‌బి) బుమ్రా 0, కరుణరత్నే (ఎల్‌బి)సిరాజ్ 0, కుశాల్ మెండీస్ (బి)సిరాజ్ 1, సమరవిక్రమ (సి)శ్రేయస్ (బి)సిరాజ్ 0, అసలంక (సి)జడేజా (బి)షమీ 1, మాథ్యూస్ (బి)షమీ 12, హేమంత (సి)కెఎల్ రాహుల్ (బి)షమీ 0, ఛమీర (సి)కెఎల్ రాహుల్ (బి)షమీ 0, తీక్షణ (నాటౌట్) 12, రజిత (సి)శుభ్‌మన్ (బి)షమీ 14, మధుశంక (సి)శ్రేయస్ (బి)జడేజా 5, అదనం 10. (19.4ఓవర్లలో ఆలౌట్) 55పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/2, 3/2, 4/3, 5/14, 6/14, 7/22, 8/29, 9/49, 10/55

బౌలింగ్: బుమ్రా 5-1-8-1, సిరాజ్ 7-2-16-3, షమీ 5-1-18-5, కుల్దీప్ 2-0-3-0, జడేజా 0.4-0-4-1.

**షమీ రికార్డు..**

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో మహ్మద్ షమీ ఓ రికార్డును తన పేర లిఖించుకున్నాడు. వాంఖడే స్టేడియంలో శ్రీలంకపై షమీ(5/14) అద్భుత బౌలింగ్‌తో మెరిసాడు. ఈ ప్రపంచకప్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే 14 వికెట్లు తీసిన షమీ.. ఓవరాల్‌గా ప్రపంచకప్‌లో 45వికెట్లు తీసినట్లయ్యింది. దీంతో వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన జహీర్ ఖాన్(44వికెట్లు) రికార్డును షమీ బ్రేక్ చేశాడు.

# కాపలాదారుడిగా ఉంటా

(మొదటిపేజీ తరువాయి)



కావొద్దు.. పార్టీ వైఖరి తెలుసుకోవాలి. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తది.. నడవడి ఎట్ల ఉన్నది అనేది గమనించాలి. అప్పుడు ఎన్నికల్లో ప్రజలు గెలుస్తరు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీ గెలుస్తే మీ కోరికలు నెరవేరుతాయి అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పుట్టిందే ప్రజల కోసం, హక్కుల కోసం, నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం రాకుండా ఉండాలని ఆలోచించే కాపలదారే బీఆర్ఎస్. ప్రజల హక్కుల కోసం 15 ఏండ్లు నిర్విరామంగా పోరాడి, చివరకు చావు నోట్లో తలకాయపెట్టి సాధించుకున్నాం. రెండు సార్లు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించారు. తెలంగాణ రాకపోతే నిర్మల్ జిల్లా అయ్యేదా..? ఇవన్నీ ఆలోచించాలి. నిర్మల్ జిల్లాను చేయించింది ఇంద్రకరణ్ రెడ్డినే. ఆదిలాబాద్ జిల్లాలో ఏం చేద్దాం ఎన్ని జిల్లాలు చేద్దామని ఆలోచించాం. ఆదిలాబాద్‌తో పాటు మంచిర్యాల చేయాలని నిర్ణయించాం. ఇంద్రకరణ్ రెడ్డి మళ్లీ గంట తర్వాత వచ్చారు. బాసర నుంచి ఆదిలాబాద్, బెజ్జూరు నుంచి ఆదిలాబాద్ రావాలంటే చాలా సమయం పడుతది. కాబట్టి నాలుగు జిల్లాలు చేయాలని అడిగారు. నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు కావాలని గంటసేపు వాదించారు. ఈ నాలుగు జిల్లాలు చేసిందే ఇంద్రకరణ్ రెడ్డినే. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా ప్రజలు చేయెత్తి దండం పెడుతున్నారు. నాలుగు మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఇవాళ ఇంజినీరింగ్ కాలేజీ కావాలని అడిగారు. తను పుట్టిన ప్రాంతం మీద ప్రేమ ఉంది కాబట్టి.. ఒకదాని తర్వాత ఒకటి అడుగుతున్నాడు ఇంద్రకరణ్ రెడ్డి. ఈ సభతో ఇంద్రకరణ్ రెడ్డి గెలిచిండని తెలిసిపోయింది. ప్రజల కోసం తండ్లాడే వ్యక్తి. నిర్మల్ చాలా అభివృద్ధి జరిగింది. ఇంజినీరింగ్ కాలేజీ పెద్ద విషయం కాదు.. ఇంద్రకరణ్ రెడ్డి మెజార్టీ 70 వేలు దాటాలి.. కచ్చితంగా జేఎన్టీయూ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ ఇప్పించే బాధ్యత నాది అని కేసీఆర్ పేర్కొన్నారు.

# ఓట్ల పండుగ... అంతా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

నామినేషన్ రోజు నుం చి ఎన్నికల ఖర్చును పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్రంలో ఎక్కడ ఓటు ఉన్నా అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. అయితే ఆయనను బలపరిచే వారు మాత్రం స్థానిక నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈ సారి ఈ నామినేషన్లలో మార్పులు చేసింది. అఫిడవిట్‌ను అసంపూర్తిగా నింపి ఇస్తే దానికి ఆర్‌వో నోటీసులు జారీ చేస్తారు. అభ్యర్థి దానిని సవరించాల్సిందిగా సూచిస్తారు. అప్పటికీ అభ్యర్థి స్పందించకుంటే నామినేషన్‌ను తిరస్కరించే అధికారం ఆర్‌వోకు ఉన్నది. నామినేషన్ దాఖలు చేయడానికి జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు కింద చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఓట్లు తెచ్చుకుంటే డిపాజిట్ తిరిగి ఇస్తారు. అన్ని రాజకీయ పార్టీలు సెకండ్, థర్డ్ లిస్టులు రిలీజ్ చేశాయి. కొన్ని సీట్లలో మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇదే సమయంలో నామినేషన్ల దాఖలుకు సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థుల ఎంపికను ఫైనల్ చేసి.. బీఫాంలు ఇవ్వాలని నిర్ణయించాయి. సమయం ఎక్కువగా లేకపోవటంతోపాటు ప్రచారంపై దృష్టి పెట్టటానికి రెడీ అవుతున్నాయి పార్టీలు. టికెట్ రాని అభ్యర్థుల బుజ్జగింపులతోపాటు పొత్తుల్లోని పార్టీలతో చర్చలను.. వీలైనంత త్వరగా ముగించాలని డిసైడ్ అయ్యాయి. ఈ క్రమంలోనే నామినేషన్ల గడువు అయిన నవంబర్ 3వ తేదీని దృష్టిలో పెట్టుకుని.. అన్ని పార్టీలు పెండింగ్.. అభ్యర్థులను ప్రకటించే పనిలో కసరత్తులు చేస్తున్నాయి.

**ఎన్నికల్లో కీలక తేదీలు ఇవే**

**నోటిఫికేషన్ తేదీ - నవంబర్ 03**

**నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ - నవంబర్ 10**

**నామినేషన్ల పరిశీలన - నవంబర్ 13**

**నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ - నవంబర్ 15**

**నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు.**

**కేవలం ఐదు మంది మాత్రమే నామినేషన్ కేంద్రాల వద్దకు రావాల్సి ఉంటుంది.**

**పోలింగ్ - నవంబర్ 30**

**ఓట్ల లెక్కింపు - డిసెంబర్ 03.**

## రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యం

**రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు :** కూకట్పల్లి ఎన్.కే.ఎన్.ఆర్ గార్డెన్స్ లో జరిగిన కూకట్ పల్లి డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లిలో పుట్టి పెరిగిన నాకు ఇక్కడ స్థానిక ఇబ్బందులపై పూర్తి అవగాహన ఉంది అని ఒకప్పుడు మంచి నీరు లేక మహిళలు ఎంతో ఇబ్బంది పడే వారని దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ , బీజేపీలు ఏనాడూ నీటి కష్టాలు పట్టించుకోలేదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటింటికి నీరు ఇచ్చి అపర భగీరథుడు గా మారారు అని కూకట్పల్లి నియోజకర్గంలో భవిష్యత్ లో నీటి కష్టాలు రాకుండా 9 రిజర్వ్ టాంక్ లు నిర్మించామని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా ముందుకు వెళుతుంది అని అలాగే నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారాక్ ద్వారా16 వేల మందికి ఒక్కొక్కరికి 1 లక్ష 116 రూపాయలు అందించామని తెలిపారు. ఇప్పటికే 60 వేల మందికి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేసామని అర్హత కలిగిన లబ్ధి దారులందరికి తప్పకుండా డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు వస్తాయని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో హైద్రాబాద్ మహా నగరంలో అందరం అన్న తమ్ముల వలె చక్కటి వాతవరణంలో జీవిస్తున్నాం అని అన్నారు.

## సంపాదకీయం

# లీడర్ కేంద్రంగా ఓట్లు

దేశంలో ఒకప్పుడు పార్టీని చూసి జనం ఓటు వేసేవారు. ఆ తర్వాత స్థానిక అభ్యర్థిని చూసి ఓట్లు పడేవి. గతం దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా 'లీడర్' కేంద్రంగా ఓట్లు పడుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ విషయంలో ఇప్పటికీ ముందంజలో ఉన్నారని చెప్పొచ్చు. గత రెండు పర్యాయాలు జరిగిన సార్వత్రిక ఎన్నికల సరళిని గమనిస్తే.. మోదీని గెలిపించడం కోసం స్థానిక అభ్యర్థి ఎవరైన్నది చూడకుండా జనం ఓట్లేస్తూ వచ్చారు. ఇదే ట్రెండ్ కొన్ని రాష్ట్రాల్లోనూ కొనసాగింది. ఈ పరిస్థితుల్లో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వ్యూహంతో ముందుకెళ్లాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించినట్టు తెలిసింది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ముందే ప్రకటించడం ద్వారా ప్రయోజనం ఉంటుందని భావిస్తుండగా.. రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల విషయంలో తేల్చకపోవడమే మంచిదని భావిస్తోంది. సాధారణంగా పార్టీ మరోసారి గెలిస్తే సిట్టింగ్ సీఎం కొనసాగుతారు. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రులను మార్చిన సందర్భాలు సైతం లేకపోలేదు.తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. తెలంగాణలో సీఎం కే. చంద్రశేఖర రావు (కేసీఆర్) ఉద్యమనేతగా తెచ్చుకున్న గుర్తింపుతో 2014లో గెలుపొందగా.. 2018లో ఆయన పనితీరుతో మెప్పు పొంది మరిన్ని ఎక్కువ స్థానాల్లో గెలుపొందారు. స్థానిక అభ్యర్థి ఎవరన్నది చూడకుండా ఈ రెండు ఎన్నికల్లో జనం కేసీఆర్ కోసమే ఓట్లు వేసినట్టు స్పష్టమవుతోంది.మరోసారి ఆయనే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగగా.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ప్రకటించకపోయినా బీసీ నేతను సీఎంను చేస్తామంటూ ప్రకటించింది. ఇక కాంగ్రెస్ సీఎం ఫేస్ ఎవరన్నదే ఇప్పుడు చర్చనీయాంశం. మరి ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తుందా.. లేక ఎన్నికల్లో గెలిచిన తర్వాత చూసుకోవచ్చులే అనుకుంటుందా? ఇదే ఇప్పుడు సర్వత్రా ఆసక్తి కల్గిస్తున్న అంశం.కొన్ని సర్వేల అంచనాలతో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్సాహంతో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తోంది. చత్తీస్‌గఢ్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ నేతృత్వంలో ఎన్నికల ప్రచారంలో ముందుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల్లో గెలిస్తే మరోసారి ఆయనకే సీఎం సీటు కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇదే తరహాలో మధ్యప్రదేశ్‌లో గెలిస్తే మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌కే ముఖ్యమంత్రి పీఠం అంటూ ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.కానీ ఎటొచ్చీ రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లోనే ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది పార్టీ అధిష్టానం నుంచి ఎలాంటి సంకేతాలు కనిపించడం లేదు. రాజస్థాన్‌లో ప్రస్తుత ఎన్నికల వ్యవహారం మొత్తం ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ చేతుల మీదుగానే సాగుతున్నప్పటికీ.. అక్కడ పార్టీ గెలిచిన తర్వాత ఆయనే సీఎంగా కొనసాగుతారని చెప్పలేకపోతోంది. సచిన్ పైలట్ రూపంలో పొంచి ఉన్న తిరుగుబాటు ముప్పే ఇందుకు కారణమా అన్న చర్చ జరుగుతోంది. 80వ దశకంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా అర్జున్ సింగ్ ఉన్న సమయంలో ఇదే జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఢిల్లీలో రాజీవ్ గాంధీని కలవడానికి వచ్చినప్పుడు, రాజీవ్ ఆయన్ను గవర్నర్‌గా పంపి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోతీలాల్ వోరాను నియమించారు. తాజాగా 2005లో సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో మహారాష్ట్రలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. కానీ అధిష్టానం అధికార పగ్గాలను విలాస్‌రావ్ దేశ్‌ముఖ్‌కు అప్పగించింది. ఈ తరహాలో రాజస్థాన్‌లో కూడా జరగవచ్చని, అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చినా సరే.. ఆయన్ను సీఎంగా కొనసాగించే అవకాశం ఉండకపోవచ్చని ఏఐసీసీలో జోరుగా చర్చ జరుగుతోంది.అసెంబ్లీ ఎన్నికల్లో సచిన్ పైలట్ సారథ్యంలో పార్టీ గెలుపొందినప్పటికీ.. ఆయనకు సీఎం పదవి దక్కలేదు. సీఎం సీటుపై కన్నేసిన ఆయన మధ్యలో ఓసారి ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేసినప్పటికీ, గెహ్లాట్ చాతుర్యంతో ఆ ముప్పు నుంచి తప్పించుకోగలిగారు. సచిన్ పైలట్‌ను శాంతింపజేసేందుకు అధిష్టానం పెద్దలు ఇచ్చిన హామీలేంటి అన్నవి బయటి ప్రపంచానికి తెలియకపోయినా.. ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతల్ని గెహ్లాట్‌కు అప్పగించే ఉద్దేశంతో ఆయన్ను సీఎం పదవి నుంచి కదిలించే ప్రయత్నం అధిష్టానం చేసింది.భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రకారం గెలుపొందిన పార్టీ ఎమ్మెల్యేలు అందరూ కలిసి ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ముందే ప్రకటించినప్పుడు ప్రజామోదం కూడా అందుకు తగ్గట్టే వచ్చినప్పుడు అనివార్యంగా ఆ నేత ముఖ్యమంత్రి అవుతారు. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు సమావేశమై ముఖ్యమంత్రి ఎవరన్నది నిర్ణయించే అధికారాన్ని అధిష్టానానికి అప్పగిస్తున్నట్టు తీర్మానిస్తూ ఉంటారు. తద్వారా ఢిల్లీ నుంచి వెళ్లే సీల్డ్ కవర్ ద్వారా సీఎం ఎవరన్నది నిర్ణయించిన సందర్భాలు కూడా కోకొల్లలు. సీఎం పదవి ఎవరిని వరించినా.. వారిని వ్యతిరేకించే వర్గం కూడా కాంగ్రెస్‌లో సిద్ధంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు అధిష్టానం పెద్దలను కలుస్తూ సీఎంపై ఫిర్యాదులు చేస్తూ ఆ సీటు నుంచి దింపే ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటుంది.ముందు గెలుపొందితే చాలు.. సీఎం ఎవరన్నది తర్వాత చూసుకోవచ్చు అన్న ధోరణిని అవలంబిస్తోంది. 'లీడర్' కేంద్రంగా జనం ఓట్లేస్తున్న ఈ తరుణంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వ్యూహం ఫలిస్తుందా.. బెడిసికొడుతుందా అన్నది మరికొద్దిరోజుల్లో తేలనుంది.

## అధికార మదంతో కేసీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: అధికార మదంతో కేసీఆర్ విర్రవిగుతున్నారని మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ "రాహుల్ గాంధీ కాళేశ్వరం పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం కాదు. ప్రతి మనిషిపై ఃఖీూ పార్టీ లక్షకు పైగా అప్పు భారం వేసింది. దొంగ విత్తనాలు మూలంగా 8 వేల మంది రైతు కుటుంబాల నాశనం అయితే కేసీఆర్ నోరు మేధపని పరిస్థితి. ఈ ప్రభుత్వం కౌలు రైతుని మర్చిపోయింది. కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు దృష్టిలో పెట్టుకుంది. కాళేశ్వరం వల్ల బంగారం అంత కేసీఆర్ ఇంటికి చేరింది. గతంలో తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పక్కన పెట్టి గెలిపిస్తే రైతులకి కేసీఆర్ చేసింది ఏంటి? ధరణి పోర్టల్‌తో కేసీఆర్ భూములు కాజేసింది నిజం కాదా.? మీపార్టీ నేతలు చేసిన దోపిడీ ప్రజలు గమనిస్తున్నారు అన్నారు.

# కేసీఆర్‌ను మేడిగడ్డే బలి తీసుకుంటుంది



కరీంనగర్- ప్రభాత సూర్యుడు : మేడిగడ్డ సగం ప్రాజెక్టు కూల్చాల్సిన పరిస్థితి వచ్చిందని.. కోట్లాది రూపాయల అవినీతితో కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ బలితీసుకుంటే. ఇప్పుడు ఆ ప్రాజెక్టే కేసీఆర్‌ను బలి తీసుకుంటున్నదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గుడినీ, గుడిలో లింగాన్నీ దిగమింగిన కేసీఆర్‌ను తెలంగాణ సమాజం శిక్షించాలన్నారు. కేసీఆర్ పాపం పండింది... కేసీఆర్ అవినీతి కుండ పగిలింది.. మేడిగడ్డ కుంగింది.. లక్ష కోట్ల ప్రజాధనం గోదావరిలో పోసిన పన్నీరైంది.. అని వ్యాఖ్యానించారు. మూడు రోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీ వెళ్తున్న రాహుల్‌గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన అనంతరం మీడియాతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.బీఆర్ఎస్ ఎంత అవినీతికి పాల్పడినా బీజేపీ కాపాడుతున్నదన్నారు. ఈ రెండు పార్టీల అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టు, దాని పరిధిలోని బ్యారేజీలు బలవుతున్నాయన్నారు. కేసీఆర్ అంటే ఇంతకాలం ప్రజలు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని చెప్పుకున్నారని, ఇప్పుడు కాళేశ్వరం కరప్షన్ రావు అని సంబోధించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. నాసిరకం పనులతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయిందన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయాయన్నారు. 25వ పిల్లర్ నుంచి 1వ పిల్లర్ వరకు పూర్తిగా కుంగిపోయిందని తెలిపారు. పిల్లర్స్ రెండున్నర ఫీట్లు కుంగిపోయిందని అధికారులే స్వయంగా చెబుతున్నారన్నారు. మేడిగడ్డ సగం ప్రాజెక్టు కూల్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. మిగతా సగం ప్రాజెక్టు పరిస్థితి కూడా సాంకేతిక నిపుణులు పరిశీలిస్తే తప్ప ఏంటనేది తెలుస్తుందన్నారు. ప్రాజెక్టును నిర్మించిన ఎల్అండ్‌టీ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఇంజనీర్లు, సీడీఓపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించి తీరుతామన్నారు. మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి ఓడిపోతారని బీఆర్ఎస్‌కు స్పష్టత వచ్చిందని తెలిపారు. అందుకే కేసీఆర్ కేంద్రం సహకారంతో కాంగ్రెస్ నాయకులపై ఐటీ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. మోదీ కంకణం కట్టుకుని కేసీఆర్‌ను గెలిపించాలనుకున్నా అది జరగదన్నారు. తమరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని.. కేసీఆర్‌ను పడగొడుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇవాళ్టి నుంచి నామినేషన్లు...

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఉదయం నుంచి అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల (ఆర్వో) కార్యాలయాలను సిద్ధం చేశారు. నవంబర్ 3వ తేదీ నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 3 నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియలో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నియమించిన ఆర్.ఓ లు నామినేషన్లు స్వీకరిస్తారు అని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. నవంబర్ 5 ఆదివారం సెలవు కావడంతో ఆరోజు అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకోరు. నామినేషన్లను స్వీకరించే కార్యాలయాల అడ్రస్ వివరాలు ఇలా ఉన్నాయి..

1. ముషీరాబాద్ నియోజకవర్గానికి జీహెచ్ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మినారాయణ (95501 47479) ను ఆర్.ఓ గా నియమించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని ముషీరాబాద్ మండల తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. ముషీరాబాద్ ఎమ్మార్వో వెంకటలక్ష్మి (94408 15881) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
2. మలక్ పేట్ నియోజకవర్గానికి హైదరాబాద్ కలెక్టరేట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న వెంకట ఉపేందర్ రెడ్డి (9951865584) ను ఆర్.ఓ గా నియమించారు. నల్గొండ క్రాస్ రోడ్ లోని మలక్ పేట్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు.. సైదాబాద్ ఎమ్మార్వోగా చేస్తున్న జయశ్రీ (9440815883) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
3. అంబర్ పేట్ నియోజకవర్గానికి హైదరాబాద్ కలెక్టరేట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అపర్ణ (9618877044) ను ఆర్.ఓ గా నియమించారు. అంబర్ పేట్ తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. అంబర్ పేట్ ఎమ్మార్వోగా పనిచేస్తున్న బిక్షపతి (9440815871) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
4. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ గా పనిచేస్తున్న వెంకటేష్ దొత్రె (7842452571) ను ఆర్.ఓ గా నియమించారు. ఖైరతాబాద్ జోనల్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. షేక్ పేట్ ఎమ్మార్వోగా పనిచేస్తున్న అనితారెడ్డి ని ఏ.ఆర్.ఓ గా నియమించారు.

### హైదరాబాద్ లో సెంటర్లు ఇవే

5. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సికింద్రాబాద్ ఆర్.డి.ఓ గా పనిచేస్తున్న టి.రవి (9440815891) ను ఆర్.ఓ గా నియమించారు. జూబ్లీహిల్స్ లోని షేక్ పేట్ తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. ఖైరతాబాద్ ఎమ్మార్వోగా పనిచేస్తున్న మొహమ్మద్ నయీమ్ ఉద్దీన్ (9440815879) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
6. సనత్ నగర్ నియోజకవర్గానికి హెచ్.ఎం.డి.ఏ ఎస్టేట్ ఆఫీసర్ గా పనిచేస్తున్న బి.కిషన్ రావు (7337055563) ను ఆర్.ఓ గా నియమించారు. సికింద్రాబాద్ జోనల్ ఆఫీసు మూడవ అంతస్తులో మారేడ్ పల్లి సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ లో నామినేషన్లను స్వీకరిస్తారు. బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ శంకర్ (9154295263) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
7. నాంపల్లి నియోజకవర్గానికి హైదరాబాద్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న లావణ్య (9440815892) ను ఆర్.ఓ గా నియమించారు. ఆసిఫ్ నగర్ తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు.. ఆసిఫ్ నగర్ తహశీల్దార్ గా పనిచేస్తున్న ఎస్.జ్యోతి (9440815873) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
8. కార్వాన్ నియోజకవర్గానికి హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కొమురయ్య (9440815892/ 9182926955) ను ఆర్.ఓ గా నియమించారు. లంగర్ హౌస్ లోని గోల్కొండ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. గోల్కొండ తహశీల్దార్ గా పనిచేస్తున్న అహల్య (9985199770) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
9. గోషామహల్ నియోజకవర్గానికి హెచ్.ఎం.డి.ఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.విక్టర్ (9866679319) ను ఆర్.ఓ గా నియమించారు. ఆబిడ్స్ జీహెచ్ఎంసీ పార్కింగ్ కాంప్లెక్స్ నాలుగో అంతస్తులో నామినేషన్లను స్వీకరిస్తారు. నాంపల్లి ఎమ్మార్వోగా పనిచేస్తున్న ఎం.ప్రేమ్ కుమార్ (9440815882) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
10. చార్మినార్ నియోజకవర్గానికి చార్మినార్ జోనల్ కమిషనర్ గా పనిచేస్తున్న టి.వెంకన్న (9618249933) ను ఆర్.ఓ గా నియమించారు. మొఘల్ పుర జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో నామినేషన్లను స్వీకరిస్తారు. చార్మినార్ ఎమ్మార్వోగా పనిచేస్తున్న నిహారిక (9440815876) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
11. చాంద్రాయణ గుట్ట నియోజకవర్గానికి హైదరాబాద్ ఆర్.డి.ఓ గా పనిచేస్తున్న ఎం.సూర్యప్రకాశ్ (9440815890)ను ఆర్.ఓ గా నియమించారు. ఇంజన్ బౌలి ఫలక్ నూమా పోలీస్ స్టేషన్ పక్కన చాంద్రాయణ గుట్ట తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. బండ్లగూడ మండలం ఎమ్మార్వో జయమ్మ (9550815875)ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
12. యాకత్ పుర నియోజకవర్గానికి హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఇ.వెంకటచారి (9948168481) ను ఆర్.ఓ గా నియమించారు. చంపాపేట్ తహశీల్దార్ ఆఫీసు, సైదాబాద్ నామినేషన్లను స్వీకరిస్తారు.. హైదరాబాద్ ఆర్.డి.ఓ గా పనిచేస్తున్న కృష్ణ కుమార్ (9440815854) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
13. బహదూర్ పుర నియోజకవర్గానికి హైదరాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న దశరత్ సింగ్ (9948168481) ను ఆర్.ఓ గా నియమించారు. బహదూర్ పుర తహశీల్దార్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. బహదూర్ పుర ఎమ్మార్వోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ గౌడ్ (9440815874) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
14. సికింద్రాబాద్ నియోజకవర్గానికి సికింద్రాబాద్ డిప్యూటీ కలెక్టర్ ఎస్టేట్ ఆఫీస్ లో పనిచేస్తున్న ఎస్.ఎల్లారెడ్డి (9989229215) ను ఆర్.ఓ గా నియమించారు. సికింద్రాబాద్ జోనల్ ఆఫీసు, సిటీ సివిల్ కోర్టు ఎస్టేట్ ఆఫీసులో నామినేషన్లను స్వీకరిస్తారు. సికింద్రాబాద్ ఎమ్మార్వోగా పనిచేస్తున్న పాండు నాయక్ (9440815884)ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.
15. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీ.ఈ.ఓ మధుకర్ నాయక్ 7288066777) ను ఆర్.ఓ గా నియమించారు. సికింద్రాబాద్ ఎస్.పి రోడ్ కోర్టు హౌస్ కాంపౌండ్ కంటోన్మెంట్ బోర్డు ఆఫీసు లో నామినేషన్లను స్వీకరిస్తారు. తార్నాకలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఎస్.పి గా పనిచేస్తున్న వసంత కుమార్ (9381806137) ను ఏ.ఆర్.ఓ గా నియమించారు.

# సీఎం అభ్యర్థి ఎవరు...

కరీంనగర్ - ప్రభాత సూర్యుడు

అమిత్‌షా బీసీ సిఎం ప్రకటనతో తెలంగాణ బీజేపీలో సిఎం అభ్యర?ధి ఎవరనే కొత్త చర్చ మొదలైంది. బీజేపీ గెలిస్తే బండి సిఎం అవుతాడా....ఈటల అవుతారా అనే చర్చ మొదలైంది. సూర్యాపేటలో జరిగిన బహిరంగసభలో అమిత్ షా చేసిన ప్రకటనతో తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొత్త చర్చ ప్రారంభమైంది.బీసీలకు పెద్దపీట వేస్తు అభ్యర్థిత్వాలు ప్రకటిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బండి సంజయ్,ఈటెల రాజేందర్ పేర్లు ముఖ్యమంత్రులనే చర్చ మొదలైంది. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీలకే సీఎం పదవిని ఇస్తామని చెప్పిన కేంద్ర హోం శాఖమంత్రి,బీజీపే అగ్రనేత అమిత్ షా చేసిన ప్రకటన.. బీజేపీ బీసీ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది.. ఈ ప్రకటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ ముఖ్యనేతలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ లకు రాష్ట్రంలో జరిగే ఎన్నికల ప్రచారాల్లో పెద్దపీట వేయడం ఇందుకు బలం చేకూరుతోంది. తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీలు తమ దూకుడు పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ రోజుకు రెండు మూడు సభలకు హజరు కావడం.. కాంగ్రేస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డిలు ఇప్పటికే చాలాచోట్ల సభల్లో పాల్గొనడంతో ఇతర పార్టీల దూకుడుకు ధీటుగా బీజేపీ పార్టీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయ ప్రదాన కార్యదర్శి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సేవలను పూర్తి స్థాయి వినియోగించుకోవడానికి బీజేపీ పార్టీ ఆయనకు స్టార్ క్యాంపెయినర్ హోదాలో ప్రత్యేక హెలికాప్టర్ కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రతిచోట సమస్యలు తెలుసుకున్న నాయకుడికి హెలికాప్టర్ కేటాయించడం ద్వారా రోజుకు రెండు మూడు నియోజకవర్గాల్లో పర్యటించ డానికి అనుకూలంగా ఉంటుందని అధిష్టానం భావిస్తోంది. దీంతో బండి సంజయ్ కి ఉన్న ప్రజాదరణను పూర్తి స్థాయి వినియోగించుకున్నట్టు ఉంటుందని ప్రణాళిక రచించినట్లు అర్థమవుతోంది... అయితే బండికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో కాబోయే సీఎం బండి సంజయ్ అంటు ప్రతిచోట కార్యకర్తలు నినాదాలు చేయడంతో అమిత్ షా మాటలకు బలం చేకూరినట్టు అవుతోంది. తెలంగాణా సాధనలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఈటల అనూహ్య పరిణామాల మధ్య బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరడంతో పాటు కేసీఆర్ వ్యూహాలను పసిగట్టి ... ఆయన దూకుడును తగ్గించే నాయకుడని, ఈటలకు బీజేపీ పార్టీలో చేరినరోజునుండి ప్రాధాన్యత ఇస్తున్నారు.ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు, ఎవరెవరికి సీట్లు ఇస్తే బీజేపీకి మెజార్టీ వస్తుందనే అంచనాలన్ని ఈటెల వ్యూహమనే చెప్పవచ్చు. సీట్ల కేటాయింపు నుండి మొదలుకుని ఇతర పార్టీలనుండి వచ్చే నాయకులను చేర్చుకోవడం దాకా పూర్తి స్థాయి భాధ్యతలను ఈటలకు అప్పగించారు. భారతీయ జనతా పార్టీ తొలి ఎన్నికల సభ ఈటల స్వంత నియోజకవర్గమైన హుజురాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేయడం, ముఖ్యమంత్రి కేసీఆర్ పై గజ్వేల్ లో పోటీచేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, ప్రధానమంత్రి నరేంద్రమోడీ,అమిత్ షా,రాజ్ నాథ్ సింగ్ లాంటి అధినాయకులు నేరుగా ఈటలతో మాట్లాడుతుండడం, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఈటెల బరిలో ఉంటాడని బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల హుజురాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన ఈటెల ప్రసంగంలో,తాను ఒక్కడిని గెలిస్తే సీఎం ను కానని,తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచినప్పుడు మాత్రమే తాను సీఎంను అవుతానన్న వీడియో బీజేపీ నాయకుల వాట్సప్ ల్లో చక్కెర్లు కొడుతోంది.

### ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో

# అన్నీ విధాలుగా అభివృద్ధి చేసాం

**మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి**



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు:**
ఇబ్రహీంపట్నం కాలనీలల్లో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం జోరుగా హుషారుగా కొనసాగుతుంది . ఈ సందర్భంగా ఆకుల యాదగిరి మాట్లాడుతూ సిసి రోడ్డు, అండర్ డ్రైనేజ్,ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వార త్రాగు నీరు వీధి లైట్లు ప్రతీ ఇంటికి ఏదో ఒక్క రూపంలో కేసీఆర్ పథకాలు చేరాయి.అద్భుతంగా 24గంటల విద్యుత్ తో సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.కారు గుర్తుకు ఓటు వేసి కిషన్ రెడ్డి ని గెలిపిస్తామని ప్రజలే చెప్తున్నారు.నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపు ఖాయం అని అంటున్నారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు, నీలం స్వేతబాలు, జెర్కోని బాలురాజు, జగన్, మంద సుధాకర్, సీనియర్ నాయకులు బర్ల జగదీష్, మహేష్ గౌడ్, యాచారం రవిందర్,ఆకుల సురేష్,జెర్కోని రాజు ముత్యాల నరేష్ (చిన్న)రమేష్ మహారాజ్, మహేష్, ఖాజా ఆకుల నరసింహ,ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం చేసిన అభివృద్ధి

# సంక్షేమ పథకాలే ఆదర్శం

**- టిడిపి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్చార్జి చింతకింది చక్రపాణి**
**- మంచాల మాజీ ఎంపీపీ మంకు ఇంద్ర**




**మంచాల :- ప్రభాత సూర్యుడు :** టిడిపి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంచార్జ్, చింతకింది చక్రపాని తన అనుచరులతో 1000 మందితో మంచాల మాజీ ఎంపీపీ ,టిడిపి నాయకురాలు మంకు ఇంద్ర బిఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసిన కార్యక్రమాలను చూసి కిషన్ రెడ్డిని ఎన్నికలలో గెలిపిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ లో కాసాని వర్గం దారెటు

**చిన్న శంకరంపేట్ - ప్రభాత సూర్యుడు :**



తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ కొంత కాలం క్రితం రాష్ట్ర టిడిపి పగ్గాలు చేపట్టి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయవద్దని , కాంగ్రెస్ కు సపోర్ట్ చేయమని అధిష్టానం అన్నారని కాసాని చెప్పి ఈమధ్యే మళ్ళీ రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆయనను నమ్ముకొని ఉన్న మెదక్ జిల్లా ముదిరాజ్ నాయకులు జాల సాయిబాబా అయోమయంలో ఉన్నట్టు ఆయన వర్గాలు తెలిపాయి. గతంలో ఈయన విట్టల్ రెడ్డి రామయంపేట్ ఎమ్మెల్యే గా ఉన్న కాలంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శిగా , మైనంపల్లి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా అనంతరం పద్మాదేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో టిఆర్ఎస్ లో చురుకైన వ్యక్తిగా పార్టీకి పనిచేశారు. ప్రస్తుతం మెదక్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా ఉంటూ గత జూన్ నెలలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని ఉన్నారు. సాయిబాబా ముదిరాజ్ వర్గం దారేటు అనేది విషయం తేల్చుకోలేక ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### హైదరాబాద్‌లో మరోసారి

# కలకలం రేపుతున్న ఐటీ దాడులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**




హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడులు కొన సాగుతున్నాయి. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కే లక్ష్మారెడ్డి సహా పులవురు ఆ పార్టీకి చెందిన నేతల ఇండ్లలో ఆదాయపు పన్నుశాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. బాలాపూర్‌లోని పారిజాత నివాసంలో గురువారం ఉదయం 5 గంటల నుంచి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆమె మహేశ్వరం ఎమ్మెల్యే టికెట్ ఆశించిన విషయం తెలసిందే. ఎమ్మెల్యే టికెట్ కోసం పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి కోట్లలో డబ్బులు ముట్టజెప్పానంటూ ప్రకటించిన సంగతి విధితమే.కాగా, మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేఎల్ఆర్ నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారు. అదేవిధంగా బాలాపూర్ గణేశ్ లడ్డూను దక్కించుకున్న వంగేటి లక్ష్మారెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అదే నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతల ఇండ్లలోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

# ఎన్నికలకు పటిష్టమైన భద్రత

**- సిపి డి ఎస్ చౌహాన్ ఐపీఎస్**
**-ఎన్నికల నిబంధనల మీద క్షేత్ర స్థాయి సిబ్బందికి కూడా అవగాహన**
**-మాడ్గుల, యాచారం పోలీస్ స్టేషన్లు**
**- ఇబ్రహీం పట్నం, మాల్ చెక్ పోస్టులను పరిశీలించిన కమిషనర్**



**యాచారం - ప్రభాత సూర్యుడు :** త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్ ఐపిఎస్ మాడ్గుల, యాచారం పోలీస్ స్టేషన్ లను సందర్శించారు . ఇబ్రహీం పట్నం మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెక్ పోస్టుల ఏర్పాట్లను కూడా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రఅసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహి ంచడానికి తమ వంతు కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు. రాచకొండ పరిధిలో దాదాపు 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకూ రాచకొండ పరిధిలో జరిపిన తనిఖీల్లో దాదాపు 40 కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను సిబ్బందికి అందించామని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కిందిస్థాయి సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద పరిజ్ఞానాన్ని, అవగాహనను కల్పించడానికి సిబ్బందితో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. రాచకొండ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలలో అసెంబ్లీ ఎన్నికలను ఎటువంటి అవకతవకలు జరగకుండా నిర్వహించడానికి అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా కమిషన్ పేర్కొన్నారు. పాత నేరస్థులను బైండోవర్ చేస్తున్నామని, మాడ్గుల పరిధిలో 90 మంది పైన గత ఎన్నికల సమయంలో పలు రకాల నేరాలకు పాల్పడిన వారిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. మాడ్గుల పరిధిలో ఈ ఏడాది జరిగిన ఐదు దొంగతనాల లో 4 కేసుల్ని ఇప్పటికే పరిష్కరించామని , 85 శాతం ఆస్తి రికవరీ చేసినట్టు వెల్లడించారు.

# స్కూల్ బస్సు కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

**- బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణం అని కుటుంబ సభ్యుల, స్థానికుల ఆందోళన**
**- సంఘటన స్థలానికి భారీగా మోహరించిన పోలీసులు**
**-12 లక్షల రూపాయల నష్టపరిహారం**




**హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు**
:స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ల బాలుడు మృతి చెందిన దుర్ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్ గ్రామంలోని గణేష్ నగర్లో నివాసం ఉంటున్న తన్నీరు శ్రీకాంత్,స్వాతి దంపతులకు కూతురు నిషిక, కుమారుడు పవన్ హర్ష కుమార్ (3) లు ఉన్నారు. కూతురు నిషిక లక్ష్మారెడ్డి పాలెం లోని క్యాండర్ షైన్ పాఠశాలలో చదువుతుంది. రోజు మాదిరిగానే గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో కూతురును స్కూల్ బస్సు ఎక్కించడానికి తండ్రి శ్రీకాంత్ మూడేళ్ల కొడుకు పవన్ హర్ష కుమార్ తో కలిసి వచ్చాడు. కూతురును బస్సు ఎక్కించి తిరిగి వచ్చే క్రమంలో, టిఎస్07యుఎన్0098 అనే నెంబరు గల స్కూల్ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఈశ్వర్ అజాగ్రత్తగా ఫోన్ మాట్లాడుతూ బస్సును ముందుకు కదిలించడంతో, తండ్రి తో పాటు వచ్చిన మూడు సంవత్సరాల చిన్నారి బస్సు ముందు టైర్ కింద పడి తలపై ఎక్కడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు బస్సు డ్రైవర్,క్లీనర్ లను చితకబాదారు.సమాచారం తెలుసుకున్న హయత్నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్కూల్ బస్సు నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం సంఘటన స్థలానికి చేరుకోవడంతో స్థానికులకు, యాజమాన్యానికి మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. చిన్నారి మృతికి పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని గొడవ చేశారు. చిన్నారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున కాలనీవాసులు ఆందోళన చేశారు. దీంతో కాలనీ పెద్దల, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో కుటుంబ సభ్యుల, పాఠశాల యాజమాన్యాల వాదోప వాదాల అనంతరం పాఠశాల యాజమాన్యం మృతుని కుటుంబ సభ్యులకు 12 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించింది. అనంతరం బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మంథనిలో బీజేపీ పార్టీ గెలుపు పేద ప్రజల బ్రతుకులకు మలుపు

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రు పట్ల సునీల్ రెడ్డి**



**మంథని -ప్రభాతసూర్యుడు :**
మంథని నియోజకవర్గంలో బీజేపీ పార్టీ గెలుపు పేద ప్రజల బ్రతుకులకుమలుపు అనిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రు పట్ల సునీల్ రెడ్డి అన్నారు. గురువారం మంథని పట్టణంలోని బిజెపి పార్టీ ఆఫీసులో ముత్తారం మండలం శాత్రజ్ పల్లి, మంథని మండలం ఆరెంద గ్రామాలకు చెందిన సుమారు 100 మంది మహిళలు, యువకులు, భారీగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి సునీల్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు, అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ మంథని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేద ప్రజల బ్రతుకుల్లో మార్పులు రావాలంటే కాంగ్రెస్ బి ఆర్ స్ కు చరమగీతం పాడి ఒక కొత్త రాజకీయ వ్యవస్థకు ఈసారి ప్రజలు పట్టం కట్టాలన్నారు. అవినీతి, అసమర్థ పాలనను ఈరోజు ప్రజలు చీదరించుకుంటున్నారని, 40 ఏళ్ళు పాలించిన కాంగ్రెస్, 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ మంథని కి చేసిన అభివృద్ధి ఏమిటో ఓట్ల అడిగే ముందు నాయకులు ప్రజలకు చెప్పాలన్నారు.ఈ ప్రాంతంలో ఒక మంత్రి ఒక స్పీకర్ ఒక ఒక ప్రధాని గా ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఎందుకు మంథని ప్రాంతం ఇంకా డెవలప్ కాలేదని పక్క నియోజకవర్గం రామగుండంలో మెడికల్ కాలేజీలు ఆర్ ఎఫ్ సి ఎల్, ఎఫ్సిఐ వంటి పరిశ్రమలు వస్తుంటే మంథని ప్రాంతానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. చేతకాని నాయకుల అసమర్థ పాలన, ఇక మంథనిలో సాగవని ఒకసారి బిజెపి పార్టీకి అవకాశం ఇచ్చి నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండపాక సత్య ప్రకాష్, కో కన్వినర్ నాంపల్లి రమేష్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్,ఇంచార్జ్ తోట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి అరె ఓదెలు, మహిళ మోర్చా అధ్యక్షులు బోసెల్లి మౌనిక, ఎస్ సి మోర్చా అధ్యక్షులు బూడిద రాజు, మైనారిటీ మోర్చా అధ్యక్షులు చంద్ పాషా,సీనియర్ నాయకులు బోగోజు శ్రీనివాస్, గాదేపు కృష్ణ, కోరబోయిన మల్లికార్జున్, కొట్టె సాంబయ్య,చీదురాల మధుకర్ రెడ్డి, బీజేవైఎం మండల, పట్టణ అధ్యక్షులు చిట్టావేన హరీష్, బుర్ర రాజు, సీనియర్ నాయకులు గుమ్మడి శ్రీనివాస్, అడిషనపల్లి శ్రీనివాస్, బోసెల్లి శంకర్, అంకాల కుమారస్వామి, కుర్మ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ టికెట్లు ఇస్తే మంచోడు, లేకుంటే చెడ్డోడా

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**
కేసీఆర్ టికెట్లు ఇస్తే మంచోడు, లేకుంటే చెడ్డోడా అంటూ మైనంపల్లి పై మంత్రి హరీష్ రావ్ మండిపడ్డారు. మల్కాజ్ గిరి ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ఇక్కడ ఎన్నికలు మంచి మనసున్న మనిషి మాటలు, ముఠాల మనిషి మధ్య పోటీ అన్నారు. మైనంపల్లి స్వార్థం కోసం పార్టీ మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్, మల్కాజగిరి రెండు చోట్ల ఓడటం ఖాయమన్నారు. కేసీఆర్ టికెట్లు ఇస్తే మంచోడు, లేకుంటే చెడ్డోడా? అని ప్రశ్నించారు. 28 రోజులు కష్టపడి రాజశేఖర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. దత్తత తీసుకొని అభివృద్ధికి బాధ్యత తీసుకుంటా అని మంత్రి అన్నారు. ఏ సర్వే చూసినా 75 నుండి 80 సీట్లతో బిఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. కర్ణాటకలో కుర్చీల కొట్లాట జరుగుతున్నది.

ఒకర్ని దించాలే, మరొకరిని ఎక్కించాలన్నారు. కేసీఆర్ రాకుంటే రియల్ ఎస్టేట్ ఢమాల్ అవుతుందని తెలిపారు.భూమికి బరువైన పంట పండుతున్నది. రైతు బంధు, రైతు బీమా తో వ్యవసాయం పండగ అయ్యిందని తెలిపారు పల్లె పల్లేన పల్లర్లు మొలిచే తెలంగాణలో అని నాడు పాటలు ఉండేవన్నారు. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అని ఉండే అన్నారు. నేడు ఆ పాటలు తిరగ రాయాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఇవన్నీ ఎలా సాధ్యం అయ్యింది. మంత్రం వేస్తే అయ్యిందా, మాయ చేస్తే అయ్యిందా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు రైతుల వద్ద డబ్బులు తీసుకున్నవి. మా ప్రభుత్వం రైతులకు డబ్బులు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ రిజెక్టేడ్ నాయకులు. పోటీ చేసేందుకు నాయకులు లేరన్నారు. పోటీ చేసేందుకు నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేరని తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215